క్లుప్తంగా

విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే హరీశ్‌రావు



హరీశ్‌రావును సన్మానిస్తున్న గ్రామస్తులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని కస్తూరిపల్లిలో సోమవారం పెద్దమ్మ పెద్దిరాజుల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దమ్మ పెద్దిరాజుల దయతో ఈ ప్రాంత ప్రజలు సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ మాణిక్యరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాపయ్య, శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పద్మ స్వామి తదితరులు ఉన్నారు.

8న పుస్తకావిష్కరణ సభ



మాట్లాడుతున్న రంగాచారి

సిద్దిపేటకమాన్: కవి, రచయిత అలాజ్‌పూర్ కిషన్ వచన కవితా సంపుటాలు వడిసెల, పేగు తెగిన పాట పుస్తకాల ఆవిష్కరణ సభ సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఈ నెల 8న నిర్వహించనున్నట్లు మంజీరా రచయితల సంఘం అధ్యక్షుడు కె.రంగాచారి తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ.. సభకు ముఖ్య అతిథిగా ప్రముఖ కవి, జర్నలిస్టు వేణుగోపాల్ హాజరవుతారాన్నరు. కవి కిషన్‌కు వేముగంటి సాహితీ పురస్కారం ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. సాహితీ ప్రియులు, కవులు, రచయితలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యాదగిరి, కిషన్, అంజయ్య, అశోక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన



మామిడి తోటను పరిశీలిస్తున్న శంకర్

నంగునూరు(సిద్దిపేట): అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ డిమాండ్ చేశారు. మగ్దుంపూర్, అంక్షాపూర్, నంగునూరు గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలతో దెబ్బతిన్న మామిడి తోటలను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అకాల వర్షాలతో జిల్లా వ్యాప్తంగా చాల గ్రామాల్లో వరి, మామిడి, కూరగాయల పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిహారం అందేలా కృషి చేయాలని కోరారు. ఆయన వెంట యాదమల్లు, సురేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



బోనాలతో తరలివస్తున్న భక్తులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని మాచాపూర్ రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి భక్తులు బోనాలు తీయటం, పుట్టకు ధ్వనిపోయుటతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ప్రయోగాల ద్వారానే సాధ్యం



పరికరాలను ప్రదర్శిస్తున్న సాదిత్ అలీ

బెజ్జంకి(సిద్దిపేట): భౌతిక, రసాయన శాస్త్రంలో ప్రయోగాల ద్వారానే అభ్యాసన సాధ్యమని సింపుల్ టాస్క్ గ్రేట్ కాన్సెప్ట్ నిర్వాహకుడు మహ్మద్ సాదిత్ అలీ అన్నారు. బెజ్జంకిలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో సోమవారం ఆయన పాల్గొని విద్యార్థులకు పలు సైన్స్ ప్రయోగాల గురించి వివరించారు. భౌతిక, రసాయన శాస్త్రంలో లోకాస్ట్, నోకాస్ట్ పరికరాలతో ప్రయోగాలు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంఈఓ మహతిలక్ష్మి, కోఆర్డినేటర్ శ్రీనివాస్, హెచ్ఎం నజీర్, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు రవీందర్‌రెడ్డి, బాలయ్య, శ్రీనివాస్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు లేదాయె.. చెట్లనీడే దిక్కాయె

ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను అమ్ముకోవడానికి రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. గిట్టుబాటు ధర కల్పించడం కోసం ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా వాటిలో కనీస వసతులు కరువయ్యాయి.

కొనుగోలు కేంద్రాల్లో వసతులు కరువు

- గగ్గోలు పెడుతున్న రైతులు
- మంత్రి పొన్నం ఆదేశాలు బేఖాతరు
- హమాలీ, సుతలీదారం భారం
- కన్నెత్తి చూడని అధికారులు



గండిపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలో తొమ్మిది ఐకేపీ, 17 సింగిల్ విండో ఆధ్వర్యంలోను కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల ప్రారంభం సమయంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో నీడ, తాగునీటి సౌకర్యం తప్పకుండా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కానీ ప్రస్తుతం మండలంలోని చాలా కొనుగోలు కేంద్రాల్లో అవి కరువయ్యాయి.

ఎండలోనే నిరీక్షణ

రైతులే ఇంటి నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నారు. అలాగే చెట్ల నీడే దిక్కవుతోంది. ఎండలోనే కొనుగోలు కేంద్రాల్లో నిరీక్షించాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. ఎండలు మరింత తీవ్రమతున్న ఈ క్రమంలో వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. కొనుకోలు కేంద్రాల్లో ప్రతి సంవత్సరం నీడ, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నప్పటికీ ఎవ్వరూ పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కనీస సౌకర్యాలు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

కనీస వసతులు కల్పించాలి



కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులైన నీడ, తాగునీటి సౌకర్యం కల్పించాలి. ఎండలు తీవ్రంగా ఉండడంతో కేంద్రాల్లో తాగునీరు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఇంటి నుంచే తాగునీరు తెచ్చుకుంటున్నాం. చెట్ల కిందనే కూర్చుంటున్నాం.
– పి.వెంకటనర్సు, గండిపల్లి

సౌకర్యాలు కల్పిస్తున్నాం

ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నీడ, తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నాం. కొనుగోలు కేంద్రాల్లో ఏ సమస్య రాకుండా ప్రతిరోజు పర్యవేక్షిస్తున్నాం.
– శ్రీనివాస్, ఏపీఎం ఐకేపీ, అక్కన్నపేట మండలం

హమాలీ, సుతలీదారానికి వసూళ్లు

ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవడానికి వచ్చే రైతులకు హమాలి, సుతలి దారం భారం తప్పడం లేదు. రూ.24 చొప్పున క్వింటాలుకు హమాలీ ఖర్చు రూ.60 చెల్లించాల్సి ఉంటుంది. అదే విధంగా సుతలీదారం కూడా రైతులే తెచ్చుకోవాల్సి ఉంటుంది. కిలో సుతలీదారం 100 బస్తాలకు సరిపోతుంది. దాని కోసం రూ.120 వరకు ఖర్చవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ డబ్బులు కూడా ముందుగానే ఇవ్వాలి. లేదంటే మరుసటి రోజే చెల్లించాల్సి ఉంటుందని రైతులు వాపోతున్నారు. హమాలీ, సుతలీదారం ఖర్చులు కూడా ప్రభుత్వమే భరించాలని కోరుతున్నారు.

యూరియా మితిమీరితే హానికరం

- భూసారాన్ని పరిరక్షించండి
- శాస్త్రవేత్తలు విజయకుమారి, శివాని



మాట్లాడుతున్న శాస్త్రవేత్త

వర్గల్(గజ్వేల్): మితిమీరి యూరియా వాడకం భూమికి హానికరమని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ శాస్త్రవేత్తలు ప్రొఫెసర్‌లు ఆర్.విజయకుమారి, డి.శివాని అన్నారు. మండలంలోని నెంటూరులో సోమవారం ఏఓ శేషశయన ఆధ్వర్యంలో నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో శాస్త్రవేత్తలతోపాటు గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పాల్గొన్నారు. సదస్సులో శాస్త్రవేత్తలు మాట్లాడుతూ యూరియా అధికంగా వాడటం వల్ల చీడపీడల ఉధృతి, రైతుల పెట్టుబడి ఖర్చులు పెరుగుతాయన్నారు. భూసార పరీక్ష ఆధారంగా ఎరువులు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ఏఓ శేషశయన, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి మాట్లాడారు. నాయకులు రంగారెడ్డి, సాదుల్లాగౌడ్, లక్ష్మారెడ్డి, ఏఈఓలు సుప్రజ తేజస్వి, సంతోష్, సునీత, భారతి, విద్యార్థులు వినయ్, ప్రణయ్ సుందర్, రైతులు పాల్గొన్నారు.

మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు

ములుగు(గజ్వేల్): పంటల సాగులో మెళకువలు పాటించి అధిక దిగుబడులు పొందాలని శాస్త్రవేత్తలు సూచించారు. ములుగు, చిన్న తిమ్మాపూర్, కొక్కొండ గ్రామాల్లో సోమవారం నిర్వహించిన సదస్సులో వ్యవసాయశాఖ జిల్లా అధికారి రాధికతో కలిసి వారు పాల్గొన్నారు. సాగు చేసే ముందు వ్యవసాయాధికారులను సంప్రదించి సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. శాస్త్రవేత్తలు వెంకటేశ్వర్‌రెడ్డి, వాణిశ్రీ, మధుబాబు, పల్లవి, లతీఫ్‌పాష, విజయమోహన్, ప్రభాకర్, ఏడీఏ అనిల్‌కుమార్, మండల వ్యవసాయాధికారి ప్రగతి, ఏఈఓలు పృథ్వి, అనుజ్ఞ, నివేదిత పాల్గొన్నారు.

రైతులపై హరీశ్‌రావు కపటప్రేమ

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న హరికృష్ణ

సిద్దిపేటరూరల్: రైతులపై హరీశ్‌రావు కపట ప్రేమను చూపుతున్నారని, అకాల వర్షం కురిసి గ్రామాల్లో అన్నదాతలు ఆగమవుతుంటే హరీశ్‌రావు మాత్రం సిద్దిపేటలోని మార్కెట్ యార్డులో ఫొటోలకు ఫోజులు ఇస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ ఎద్దేవా చేశారు. మండల పరిధిలోని వెంకటాపూర్‌లో అకాల వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రంలో తడిసిన రైతుల ధాన్యాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నష్టపోయిన రైతులకు రూ.10 వేలు అందిస్తానని హామీ ఇచ్చి మర్చిపోయారన్నారు. నాయకులు మహేందర్‌రావు, యాదగిరి, కలీమొద్దీన్, బుచ్చిరెడ్డి, గోపీకృష్ణ, రాజ్‌మహమ్మద్, వాహబ్, రషీద్, శ్రీకాంత్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా ఉద్యోగాల కల్పనకు కృషి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్య, ఉద్యోగాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ చెప్పారు. రాష్ట్ర మైనార్టీ సెల్ మాజీ వైస్ చైర్మన్ వహీద్‌ఖాన్ ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్‌ల ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను స్థానిక అబునాయబ్ చిష్తి దర్గా ఫంక్షన్ హాల్‌లో సోమవారం సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయిన ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచిందని, నాణ్యమైన భోజనం అందిస్తున్నామన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్‌లు విడుదల చేస్తూ ఉద్యోగాలు కల్పిస్తున్నారని చెప్పారు.

భూ ఆధార్‌కు పేర్ల నమోదు



చిన్నకోడూరులో మాట్లాడుతున్న ఏఓ జయంత్

చిన్నకోడూరు(సిద్దిపేట)/దుబ్బాకటౌన్/నంగునూరు(సిద్దిపేట)/మద్దూరు(హుస్నాబాద్): రైతులకు గుర్తింపు కార్డు(భూ ఆధార్) పొందేందుకు రైతులు తమ పేర్లు నమోదు చేయించుకోవాలని వ్యవసాయ అధికారులు పలు మండలాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నకోడూరు రైతు వేదికలో మండల వ్యవసాయశాఖ అధికారి జయంత్ కుమార్ సోమవారం నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ఆధార్ కార్డు తరహాలోనే ఈ గుర్తింపు కార్డులో రైతుల సమగ్ర వివరాలు నమోదు చేస్తారన్నారు. భూమి వివరాలు, బ్యాంకు రుణ అర్హత, సబ్సిడీలు, పంట నష్టం పరిహారం వంటి సమాచారం అందుబాటులో ఉంటుందని చెప్పారు. అలాగే దుబ్బాకలో మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఫార్మర్ రిజిస్టర్‌ను తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ లు మనోజ్ఞ, హరీశ్, సంతోష్ తదితరులున్నారు. నంగునూరు రైతు వేదికలో ఏఓ గీత మాట్లాడుతూ ఈ నమోదు ప్రక్రియ మంగళవారం నుంచి జూన్ 6 వరకు నిర్వహిస్తారన్నారు. పట్టాపాస్ పుస్తకం, ఆధార్ కార్డుకు లింక్ ఉన్న ఫోన్‌ను తీసుకెళ్లి వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించాలని చెప్పారు. అదే విధంగా మద్దూరు వ్యవసాయ కార్యాలయంలో ఏఓ రామకృష్ణ మాట్లాడుతూ ఈ ప్రక్రియ ద్వారా పీఎం కిసాన్, పంట బీమాతో పాటు పలు పథకాలను అమలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు కల్పన, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు సవాలక్ష నిబంధనలు

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సవాలక్ష నిబంధనలు ఎందుకని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రశ్నించారు. సోమవారం గజ్వేల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలపై మండిపడ్డారు. 60 గజాలలోపే ఇళ్లు కట్టుకోవాలని, పిల్లర్లు ఉండొద్దని తదితర ఆంక్షలు విధించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ పథకాన్ని పూర్తిగా కాంగ్రెస్ కార్యకర్తలకే వర్తింపజేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. నిజమైన అర్హులను పట్టించుకోకుండా కార్యకర్తలకే పథకాన్ని వర్తింపజేయాలని చూడటం సిగ్గుచేటన్నారు.

నష్టపోయిన వారికి పరిహారం అందేలా చూస్తాం

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చూస్తామని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో దెబ్బతిన్న వరి పంటను సోమవారం ఆయన మండల వ్యవసాయాధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. దుద్దెడ, మర్పడ్గ, సిర్సనగండ్ల, ఖమ్మంపల్లి, జప్తినాచారం, దమ్మక్కపల్లి, కొండపాక, తిమ్మారెడ్డిపల్లి, లకుదారం, కుకునూరుపల్లి గ్రామాల్లో సుమారు 800 ఎకరాల్లో వరి, మామిడి పంటలు దెబ్బతిన్నాయి. అప్పులు చేసి ఆరు గాలం కష్టించి పండించిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, నష్ట పరిహారం అందించకపోతే తమకు చావే శరణ్యమంటూ రైతులు వేడుకున్నారు. దీంతో ఆయన మాట్లాడుతూ దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందేలా చూస్తామన్నారు. అధికారులు శివరామకృష్ణ, గోవిందరాజు, పార్టీ మండల అధ్యక్షుడు లింగారావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ప్రభుత్వం

చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): వడగళ్ల వానతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి భరోసానిచ్చారు. మండలంలోని లింగంపేట, కాన్గల్, ఎల్లారెడ్డిపేట, పెద్ద మాసాన్‌పల్లిలో పంటలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దృష్టికి రైతుల సమస్యలను తీసుకుపోతామని, అలాగే కలెక్టర్‌తో మాట్లాడి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. నష్టం పోయిన రైతులు అధైర్యపడొద్దన్నారు. నియోజకవర్గంలో తొగుట మండలంలో అధికంగా నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు స్వామి, రాంరెడ్డి, పోచయ్య, నరేందర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, రవీందర్, నర్సింహులుగౌడ్, యాదగిరి, నారాయణరెడ్డి, దుర్గారెడ్డి పాల్గొన్నారు.

ఆందోళన చెందొద్దు

సిద్దిపేటజోన్: తడిసిన ధాన్యాన్నికూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందొద్దని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు అన్నారు. సిద్దిపేట మార్కెట్ యార్డును సోమవారం సందర్శించారు. సమస్యలు లేకుండా అధికారులు పనిచేయాలని కోరారు. నాయకులు గయాజ్, హర్షద్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం.. ప్రభుత్వానిదే పాపం

- 28 టీఎంసీల నీళ్లున్నా విడుదల చేయలేదు
- రైతుల పరామర్శకు కలెక్టర్ నిరాకరణ
- మంత్రులు జేబులు నింపుకుంటున్నారు
- ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి



రామారంలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): వడగళ్ల వానతో పంటలకు నష్టం వాటిల్లిన పాపం కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని లింగంపేటలో నష్టపోయిన పంటను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మల్లన్న సాగర్‌లో 28 టీఎంసీల నీరు నిల్వ ఉన్నా సకాలంలో విడుదల చేయలేదన్నారు. నీటిని విడుదల చేయాలని తాను చెప్పినా వినిపించుకోలేదని, ముందుగా నీటిని విడుదల చేసి ఉంటే ఇంత నష్టం జరిగేదికాదని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో వరి, మొక్కజొన్న, కూరగాయల పంటలతో పాటు మామిడి రైతులు నష్టపోయారని చెప్పారు. రైతులకు భరోసా కల్పిద్దామని కలెక్టర్‌కు ఫోన్‌చేస్తే రానన్నారని, భూ భారతి కార్యక్రమానికి వెళ్తున్నానంటూ ఆయన చెప్పడం బాధకలిగించిందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల చేతులు తడిపితేనే పనులు జరుగుతున్నాయని ఆరోపించారు. మంత్రులు జేబులు నింపుకునే పనిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. 24 గంటలు గడుస్తున్నా గ్రామాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరించలేదని ఆరోపించారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.35 వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ స్వామి, నాయకులు భైరాగౌడ్, నర్సింహులు, రాజిరెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

రైతుల పాలిట శాపంగా మారిన కాంగ్రెస్

దుబ్బాకటౌన్: రాయపోల్ మండలంలోని సయ్యద్ నగర్, రామారం గ్రామాలలో నష్టపోయిన పంట పొలాలను ఎమ్మెల్యే పరిశీలించారు. జిల్లా యంత్రాంగం క్షేత్ర స్థాయిలో పొలాలను పరిశీలించి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి బాబు నాయక్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ బాలయ్య, ఏఓ నరేశ్, నాయకులు వెంకటేశ్వర శర్మ, యాదగిరి, రాజిరెడ్డి తదితరులు న్నారు.

అధికారులకు బాధ్యత లేదా?

మిరుదొడ్డి(దుబ్బాక): వడగళ్ళ వర్షాలతో నష్టపోయిన రైతులకు భరోసా కల్పించాల్సిన బాధ్యత జిల్లా అధికారులకు లేదా అంటూ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని అల్వాలలో నష్టపోయిన పంట పొలాలను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి సోమవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. జిల్లా అధికారులు పంటలను పరిశీలించక పోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో నాయకులు పోలీస్ రాజులు, సూకూరి లింగం, రాంరెడ్డి, ఎండీ.అహ్మద్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి

దౌల్తాబాద్(దుబ్బాక): పంట నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వమే ఆదుకోవాలని ఎమ్మెల్యే ప్రభాకర్ అన్నారు. దౌల్తాబాద్, రాయపోల్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో నష్టపోయిన పంట పొలాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఆయన వెంట రహీమొద్దీన్, మాజీ సర్పంచ్‌లు ఉన్నారు.

నిరుద్యోగులకు టీవైఆర్ సేవలు

ఫౌండేషన్ చైర్మన్ రాజు



విద్యార్థినులతో మాట్లాడుతున్న రాజు

గజ్వేల్: గజ్వేల్‌లో నెలకొల్పిన టీవైఆర్ ఫౌండేషన్ లైబ్రరీని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆ ఫౌండేషన్ చైర్మన్ టి.రాజు కోరారు. స్థానిక ఫౌండేషన్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండేళ్లుగా తమ లైబ్రరీలో ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పనకు, ఉన్నత విద్యావకాశాలకు బాటలు వేస్తోందన్నారు. కేజీ నుంచి పీజీ వరకు విద్యావకాశాలకు సంబంధించిన సమాచారం, కెరీర్ గైడెన్స్‌కు సంబంధించిన పుస్తకాలను అందుబాటులో ఉంచామని, అలాగే కంప్యూటర్ ల్యాబ్‌లను కూడా ఏర్పాటు చేశామని చెప్పారు. నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లోనూ తమ సంస్థ ఆధ్వర్యంలో నాలెడ్జ్ సెంటర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. సమావేశంలో ఫౌండేషన్ కోఆర్డినేటర్ శివసాగర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ అధికారికంగా బాలుడి దత్తత

సిద్దిపేటరూరల్: జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లాకు చెందిన దంపతులకు అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ చేతుల మీదుగా అధికారికంగా ఓ బాలుడిని దత్తత ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దత్తత తీసుకున్న దంపతులు ఆ చిన్నారిని బాగా చదివించాలన్నారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఓ లక్ష్మీకాంత్‌రెడ్డి, బాల రక్షా భవన్ కోఆర్డినేటర్ మమత, డీసీపీఓ రాము, శిశుగృహ మేనేజర్ రాజు, రాజారాం పాల్గొన్నారు.

◆ సమస్యల పరిష్కారమే ధ్యేయం

గజ్వేల్‌రూరల్: కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా బీఎంఎస్ పనిచేస్తుందని ఆ సంఘం ఆలిండియా ఉపాధ్యక్షుడు మల్లేశం అన్నారు. ప్రజ్ఞాపూర్ పరిధిలోని రాణే పరిశ్రమలో సోమవారం ఆయన యూనియన్ అడ్వైజర్ రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీశైలంతో కలిసి గేట్ మీటింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాణే పరిశ్రమ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో బీఎంఎస్‌ను గెలిపించాలన్నారు. శ్రీనివాస్, నజీర్, రాములు పాల్గొన్నారు.

◆ మత్తు పదార్థాలపై పటిష్ట నిఘా

హుస్నాబాద్: గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామని ఎస్ఐ మహేశ్ చెప్పారు. సోమవారం రాత్రి అనుమానాస్పద ప్రాంతాల్లో నార్కొటిక్స్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహించారు. గంజాయి, మత్తు పదార్థాలు కలిపిన చాక్లెట్స్ కలిగి ఉన్నా.. విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

◆ క్రమశిక్షణతోనే బంగారు భవిష్యత్

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకొని బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఎంఈఓ కృష్ణ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ఎంపీపీఎస్‌లో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం సోమవారంతో ముగిసింది. హెచ్ఎం మధునాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు లింగం విద్యాసాగర్, శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్తులు కల్యాణి, రేణుక, ఉపాధ్యాయులు రెహాల, కల్పన, సాధన, రమ పాల్గొన్నారు.

◆ విద్యార్థులు రాణించడం శుభ పరిణామం

మిరుదొడ్డి(దుబ్బాక): వేసవి శిక్షణలో విద్యార్థులు రాణించడం శుభ పరిణామమని ఎంఈఓ దోమకొండ అంజాగౌడ్ అన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయడానికి ఈ శిక్షణ ఎంతో దోహదం చేసిందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ గౌతమి, హెచ్ఎం కిషన్, టీచర్లు రాజేశ్వరి, బాలకృష్ణ, ఇందిర, విద్యా వాలంటీర్ సరిత పాల్గొన్నారు.

◆ కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ

కొండపాక(గజ్వేల్): మండలంలో పలువురికి మంజూరైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను సోమవారం రైతు వేదికలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్లు శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, తహసీల్దార్ సుజాత, ఎంపీడీఓ రాంప్రసాద్, నాయకులు కరుణాకర్, ఉపేందర్, రవీందర్, మహేందర్, రవి, వెంకటేశ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

◆ కన్యకాపరమేశ్వరి జయంత్యోత్సవాలు

సిద్దిపేటకమాన్: సిద్దిపేటలో 6, 7వ తేదీలలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంత్యోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య భవన కమిటీ అధ్యక్షుడు రాజేశం తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో ఇంటింటికీ కరపత్రాలు, వాసవీమాత చిత్రపటాన్ని అందిస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్, కృష్ణమూర్తి, రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, రవి, రాజేశం, దామోదర్, శ్రీధర్, నవీన్‌కుమార్, శ్రీనివాస్, మంజుల, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సతీమణి పూజలు

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి శ్రీలక్ష్మీనర్సింహస్వామిని సిద్దిపేట ఎక్సైజ్ సూపరింటెండెంట్ సతీమణి మధుమతి, హుస్నాబాద్ ఎక్సైజ్ ఎస్ఐ రూపారెడ్డి సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ప్రభాకర్ యాదవ్, పూజారి శేషం మధుసూదనాచారి వారికి స్వామివారి చిత్రపటాలను అందజేసి సత్కరించారు. ఆలయ సిబ్బంది సునీత, ప్రవీణ్, కనుకయ్య పాల్గొన్నారు.

◆ నేడు ఆలయ భూమి వేలం

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్‌లోగల వేణుగోపాలస్వామి ఆలయానికి సంబంధించిన భూములకు కౌలు కోసం వేలం పాట నిర్వహిస్తున్నట్లు కొండపోచమ్మ ఆలయ ఈఓ రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయ ఆవరణలో మంగళవారం ఉదయం 10 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.